నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ప్రకాశం
మార్కాపురం
బాపట్ల
సోమవారం 23 ఫిబ్రవరి 2026 పేజీలు 8









- బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన
- తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష
- కోటి మందికి పైగా సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ: అనగాని సత్యప్రసాద్

# అట్టహాసంగా బాపట్ల పార్లమెంట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**సూర్యప్రతినిధి, బాపట్ల**

అట్టహాసంగా బాపట్ల పార్లమెంటు నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం, బాపట్ల జిల్లా టిడిపి కార్యాలయ శంకుస్థాపన అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని బధిరుల ఆశ్రమ పాఠశాల పక్కన దివ్య ముహూర్తంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య అతిరథ మహారధుల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వేదపండితులు పూర్ణకుంభంతో ముఖ్యఅతిథులకు స్వాగతం పలికారు. నూతన కమిటీ సభ్యులతో జిల్లా ఇన్ఛార్జి మంత్రి, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి ప్రమాణస్వీకారం చేయించారు.

గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో జిల్లాలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి జరగాలంటే, రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మరల అధికారంలోకి రావాలని కోరారు. ఎన్టీఆర్ తెలుగుదేశం స్థాపించిన తర్వాత తెలుగు వారి కీర్తి, ఆత్మగౌరవం దేశంలో నలుదిశలా వ్యాప్తి చెందిందని తెలిపారు. అంతే కాకుండా రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కులాలు, మతాల మధ్య విధ్వంసాలు సృష్టించి అల్లర్లకు, గందరగోళానికి గురి చేసి, కంపెనీలు రాకుండా చేసి, మన పిల్లల భవిష్యత్తు కాలరాసేలా చూస్తుందని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టి అధికారంలోకి



వచ్చిన తర్వాత తెలుగు ప్రజల రాజకీయాలు అపహాస్యాం పాలయ్యాయని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడికైనా వస్తాం, సిబిఐ చార్జిషీట్‌లో నెయ్యిలో కల్తీ జరగలేదని నిరూపించే దమ్ము, ధైర్యం వైసీపీ నేతలుకు ఉంటే చర్చలకు రావాలని సవాలు విసిరారు. సాక్షాత్తు మాజీ టిటిడి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కల్తీ జరిగిందని ఒప్పుకొంటే, వైసిపి నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని చెప్పటం సిగ్గుచేటన్నారు. మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. టిడిపి పార్టీకి కార్యకర్తలే కొండంత బలమని చెప్పారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడే, క్రమశిక్షణ పడే కార్యకర్తలు ఉన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అనునిత్యం తపనపడుతుం టారు. కార్యకర్తల శ్రమ ఫలితమే 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. కార్యకర్తల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ, పదవులు వచ్చినా రాకున్నా ప్రతి కార్యకర్తకు గౌరవం ఇచ్చే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు.

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఢిల్లీలో మదరాసీలను తెలుగు వారిగా మిగతా 8లో

# ఒంగోలులో 'స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్'

- రూ.4.50 కోట్లతో ఏర్పాటుకు నిర్ణయం
- మామిడిపాలెం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఏర్పాటు
- 25 కంటైనరుల్లో వంద షాపుల ఏర్పాటుకు ప్రణాళిక

ఒంగోలు కార్పొరేషన్, మేజర్‌న్యూస్: ఒంగోలు కార్పొరేషన్ హెూదాకు తగ్గటుగా స్ట్రీట్ ఫుడ్‌ను ప్రమోట్ చేసేందుకు ఒంగోలు కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆదేశాల మేరకు ఈ స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్ త్వరలో నగరవాసుల ముందుకు రానున్నాయి.



'స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్' పేరుతో స్థానిక మామిడిపాలెం ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు పడమరవైపున ఉన్న ఖాళీ స్థలంలో దీన్ని నెలకొల్పనున్నారు. ఇందుకోసం మొత్తం రూ. 4.50 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించగా అందుకు ఈనెల 10న జరిగిన ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం లభించింది.

**రోడ్లవెంట వ్యాపారులు తరలింపు**

ఒంగోలులో ఎక్కడ పడితే అక్కడ రోడ్ల వెంట ఉన్న టీ, టిఫిన్ దుకాణాలు, హెూటల్స్,

మిగతా 6లో

# దేవుడితో ఆటలొద్దు జగన్!!

- వైసిపి తగిన మూల్యం చెల్లించక తప్పదు
- స్వార్థ రాజకీయాల కోసం వేంకటేశ్వరస్వామిని వాడుకోవడం ఘోర తప్పిదం
- ఐదేళ్ళ వైకాపా పాలనలో టిటిడిలో జరిగిన అక్రమాలు కోకొల్లలు
- చేసిన తప్పులకు క్షమాపణలు చెప్పకపోగా హెరిటేజ్‌పై అసత్య విమర్శలు
- మీడియాతో మంత్రి డాక్టర్ స్వామి ధ్వజం
- శాసనమండలిలో వైసిపి నేతల తీరు సిగ్గుచేటు: ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు, మేజర్‌న్యూస్: వైసీపీ నాయకులు తమ స్వార్థ రాజకీయా లకు వేంకటేశ్వరస్వామిని వాడుకో వడం సిగ్గుచేటు, దేవుడితో పెట్టు కుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. ఆదివారం ఒంగోలులో ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి జిల్లా అధ్యక్షులు, కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, బిజెపి జిల్లా అధ్యక్షులు శెగ్గం శ్రీనివాసరావు, జనసేన జిల్లా నాయకులు కంది రవిశంకర్‌లతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ హయాంలో జగన్ తన సొంత చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా నియమించి అనేక అక్రమాలకు పాల్పడ్డారు. గత 5 ఏళ్లు టీటీడీలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. వైవి సుబ్బారెడ్డి మిగతా 6లో

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
PRAKASAM ప్రకాశం | MARKAPURAM మార్కాపురం | BAPATLA బాపట్ల

# అర్హులైన వారి నుంచి దరఖాస్తుకు అవకాశం



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం త్వరలో అర్హులైన దరఖాస్తుదారులకు పెన్షన్లు మంజూరు చేయు అవకాశం ఉన్నదని తెలియ వచ్చిందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తోనే సాయిబాబా తెలిపారు.ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన దరఖాస్తుదారులు సంబంధిత దరఖాస్తులను దరఖాస్తు తో జతపరచవలసిన సర్టిఫికెట్లను పూర్తిచేసుకుని తీసుకుని వచ్చి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇచ్చినట్లయితే సదరు దరఖా స్తులను ఆన్లైన్ చేయించి అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయిం చుటకు కృషి చేయబడు తుందన్నారు.ఈ అవ కాశం ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకో వాల్సిందిగా సాయిబాబా కోరారు.కొత్తగా పెన్షన్ కొరకు దరఖాస్తు చేయుటకు కావాల్సిన ఇన్కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్ లు లేటెస్ట్ గా ఈ క్రొత్త సంవత్సరం లో (2026)తీసుకున్నవై ఉండాలన్నారు.ఆధార్,ఆధార్ హిస్టరీ, రేషన్ కార్డు,ఇన్కమ్ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్,ఆధార్ నెంబర్ కు మొబైల్ లింక్ అయ్యి ఉండాలనీ తెలిపారు.వితంతు పెన్షన్, ఒంటరి మహిళా పెన్షన్,వృధాప్య పెన్షన్,చేనేత పెన్షన్ కొరకు,వికలాంగుల పెన్షన్,మరియు అన్ని రకాల పెన్షన్లు కు ఓటర్ కార్డు తప్పనిసరి మరియు ఓటు ఆధార్ నందు గల చిరునామా లోనే ఉండవలె నన్నారు.పూర్తి చేసిన మీ దరఖాస్తులను,అందుకు సంబంధిత సర్టిఫికెట్లు అన్ని జతపరచి,వెంటనే మా కార్యాలయమునకు తీసుకువచ్చి ఇచ్చినట్లయితే, వాటిని జాగ్రత్తగా ఆన్లైన్ చేయించి,మంజూరుకు కృషి చేయబడునని సాయిబాబా పేర్కొన్నారు.

## త్వరలో శెనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కారంచేడు, మేజర్న్యూస్: ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరతో ఏపీ మార్క్ ఫైడ్ ద్వారా కారంచేడు మండలంలో శనగ కొనుగోలు త్వరలో ప్రారంభం కానున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. మండల వ్యాప్తంగా రైతులు రైతు సేవ కేంద్రం ద్వారా సీఎం యాప్ లో పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం మండల వ్యాప్తంగా రైతులు 4405.10 హెక్టార్లలో శనగ పంటను సాగు చేశారని తెలిపారు.ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రైతులు కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువెళ్లాలని తేమశాతం నిర్ణీత పరిమితిలో ఉండాలని వివరించారు.



## 1181 మందికి షుగరు పరీక్షలు, మందుల పంపిణీ

చీరాల, మేజర్న్యూస్: వాడరేవులో నిర్వహించిన ఉచిత షుగరు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆశ్రమం ఆవర ణలో శిబిరం నిర్వహించారు. 1181 మంది షుగర్ బాధితులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి నెల రోజుల మందులు అందజే శారు.ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజర్ ఎన్. సురేష్ వివరాలు వెల్లడించారు. శిబిరంలో డాక్టర్లు ఎం. రాజరాజేశ్వరి, కమలా రాజేశ్వరి, లలిత్ ప్రకాష్, పేట శ్రీకాంత్, ప్రకాష్ వైద్య సేవలు అందించారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె. కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు, ఎంజీ శంకరరావు, బసవరావు, కుమార్, కె. లింగరాజు, మోహన్, వలి, గోపాల్ తదితరులు సహకరించారు.



## భక్తుల పాలిట కొంగు బంగారం శ్రీలక్ష్మీ అమ్మవారు

దర్శి, మేజర్న్యూస్: అమ్మవారిని కొలిచే భక్తుల పాలిట కొంగు బంగారం శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారిని భక్తుల ప్రగాఢ నమ్మకం. శ్రీ లక్ష్మీ అమ్మవారికి భక్తులు విశేషా అలంకరణ చేశారు. శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మవారికి భక్తులు వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరింప చేశారు. గర్భగుడితోపాటు దేవాలయాన్ని పూలమాలతో అలంక రంప చేశారు. దర్శికి చెందిన అమ్మవారి భక్తుడు కట్టే కోట హరీష్ ప్రతి ఆదివారం వివిధ రకాల పూలతో దేవాలయాన్ని అలకరింప చేస్తుంటాడు. ఇటీవల జరిగిన అమ్మవారి అన్నదాన కార్యక్రమానికి హరీష్ భారీ విరాళాన్ని దేవాలయ అధికారులకు అందజేశారు. అమ్మవారి దర్శనానికి దేవాలయానికి వచ్చే భక్తులు దాహార్తిని తీర్చేందుకు 75 వేల రూపాయలతో వాటర్ ట్యాంక్ను హరీష్ ఏర్పాటు చేయించారు.



## నిశ్చితార్థ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు, మేజర్న్యూస్: ఒంగోలు పట్టణంలో ఘనంగా నిర్వహించిన జాస్తి విష్ణు, దామచర్ల హారిక ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి హాజరై నూతన దంపతులకు ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వధూవరుల కుటుంబ సభ్యులతో సన్నిహితంగా మాట్లాడి వారి ఆనందంలో పాలుపంచుకున్నారు. యువజంట భవిష్యత్తులో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో నిండిన జీవితం గడపాలని ఆకాంక్షించారు.

## నాగమల్లేశ్వరరావుకు ఉయ్యాలవాడ సేవా పురస్కారం



చిన్నగంజాం, మేజర్న్యూస్: చిన్న గంజాం మండలంసోపిరాలకు చెందిన ఉపాధ్యాయుడు సిద్ధం నాగమ ల్లేశ్వరరా వు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవాపు రస్కారం 2026 కు ఎంపిక అయ్యారు. ఈయన కొత్తపాలెం పంచాయతీ రామ చందరనగర్ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహి స్తున్నాడు.ఫిబ్రవరి 22వతేదీ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి179వ వర్ధంతి సందర్భంగా, సమాజంలో వివిధ రంగాలలో నిరంతరం సేవచేసే వారిని గుర్తించి ఎంపికచేసినట్లు ఆయనతెలిపారు.గత 24 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ విద్యా ర్థుల అభ్యున్నతికి పాటుపడుతూ అక్షర ప్రకాశం,పల్స్ పోలియో,రక్తదాన శిబిరాల నిర్వహణ,కరోనా సమయంలో అవగా హన కార్యక్రమాలు, తుఫాను సమ యాలలో ప్రజలను అప్రమత్తత చేయ టం, తదితర అంశాలను పరిగణలో నికి తీసుకుని ఈ అవా ర్డుకు ఎంపిక చేయడం జరిగిం దని అవార్డు గ్రహీత తెలియ జేశారు.అవార్డును ఆన్లైన్ ద్వారా ప్రధానం చేసినందుకు వాజ్ పేయి,అద్వానీ సేవాసంస్థ వ్యవస్థాపకులు పాలకొలనువీరారెడ్డి కి ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ నాయబ్ రసూల్,విద్యాకమిటీ చైర్మన్,మస్తాన్ రావు, ఉపా ధ్యాయులుఎం.వెంకటేశ్వర్లు పి.శ్రీని వాసరావు, పి.సరళ,పి. హిమవంతేశ్వరి, సిహెచ్.సురేంద్ర కుమార్ తదితరులు అభినందించారు.

## బాల్ బ్యాడ్మింటన్ విన్నర్స్‌గా దుర్గి ఉన్నత పాఠశాల



నగరం, మేజర్న్యూస్: జిల్లా బాల్ బ్యాడ్మి ంటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నగరం బాలయేసు ఇంగ్లీషు మీడి యం హైస్కూలు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ఆదివారం పోటీలు నిర్వహించారు. మొత్తం 10 టీమ్‌లు పాల్గొనగా, విన్నర్స్‌గా దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రన్నర్స్ గా నగరం బాలయేసు ఇంగ్లీషు మీడియం హైస్కూలు నిలిచారు. మూడు, నాల్గవ స్థానాలను వరుసగా ధూళిపాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా ర్థులు దక్కించుకున్నారు. విజేతలకు బహుమ తులను ఆళ్ళ పూర్ణచంద్ర రావు, చింతల గోపి, వారె వెంకటశివారెడ్డి, కె. సుధీర్‌కుమా ర్‌లు సమకూర్చగా గెలుపొందిన విద్యార్థులకు బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠ శాల కరస్పాండెంట్ సిస్టర్ సునా, ప్రిన్సిపల్ సిస్టర్ సజీవ, రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసి యేషన్ జాయింట్ సెక్రట రీ, జిల్లా ప్రసిడెంట్ ఇ. శివశంకర్, కార్యదర్శి వై. శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు బి. నర్సయ్య, పాఠశాల వ్యా యామ ఉపాధ్యా యుడు వైవి గోపయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హాకీ పోటీలు ప్రారంభం



సంతనూతలపాడు, మేజర్న్యూస్: రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా సబ్ జూనియర్ హాకీ బాలబాలికల జట్ల ఎంపిక ఆదివారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారితో జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియను జిల్లా కార్యదర్శి ఏ.సుందర్ రామిరెడ్డి ఆధ్వర్యం లో చంద్రశేఖర్, టి.రవికు మార్, పి.రవి ఎంపికలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హాకీ క్లబ్ మైనంపాడు అధ్యక్షులు గొడుగు కాలేశా పోటీలను ప్రారంభించారు. ఎంపికైన జట్లు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కార్యదర్శి సుందరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, చంద్రశేఖర్, పి.రవి, పిడిలు వనజ, శ్రీనివాసరావు, కౌసల్య, చంద్రశేఖర్, వెంకటే శ్వర్లు, శ్రీకాంత్, సీనియర్ హాకీ క్రీడాకారులు రాఘవేంద్ర, లింగయ్య, శ్రీను పాల్గొన్నారని పిఈటి తిరుమలశెట్టి రవికుమార్ తెలిపారు.

## ఘనంగా ఉయ్యాలవాడ వర్ధంతి



బాపట్ల మేజర్న్యూస్: ఉయ్యాలవాడ నరసి ంహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం బాప ట్ల రెడ్డి సోదరులు బాపట్ల ఏరియా హాస్పటల్లో రోగులకు భోజనం సదుపాయం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా రెడ్డి సోద రులు మాట్లాడు తూ బాపట్ల లో ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సోదరులు పాల్గొన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన కదిరి

కనిగిరి, మేజర్న్యూస్: వెలిగండ్ల మండలానికి చెందిన గుంటక రఘురామిరెడ్డి కుమార్తె డాక్టర్ లిఖితారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణా రెడ్డిల వివాహ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపి పరిశీలకులు కదిరి బాబు రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, రెడ్డి కార్పోరేషన్ మాజీ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణ రెడ్డి, జడ్పిటీసి సభ్యులు గుంటక తిరుపతి రెడ్డి, ముక్కు బాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## చెన్నయ్యకు టిడిపి నాయకుల నివాళి

దర్శి, మేజర్న్యూస్: మండలం పోతవరం పంచాయతీ పరిధిలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన తెలుగుద ేశం పార్టీ కార్యకర్త తలపాటి చెన్నయ్య మృతి చెందారు. దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మి కడియాల లలిత్ సాగర్ ఆదేశాలతో తిమ్మాయపాలెం గ్రామానికి వెళ్లి చెన్నయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి దర్శి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు దర్శి టౌన్ అధ్యక్షులు పుల్లలచెరువు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో దర్శి టౌన్ పార్టీ అధ్యక్షు లు పుల్లలచెరువు సత్యనారాయణ, స్థానిక నాయకులు, బ సిరెడ్డి రామచంద్రారెడ్డి, పాలుట్ల రమణారెడ్డి పాల్గొన్నారు.



## ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం

చీరాల, మేజర్న్యూస్: జిల్లా ఎస్పీ శ్రీ బి.ఉమామహే శ్వర్ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు చీరాల డి.ఎస్.పి మొ యిన్ సూచనలతో చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ప్రజ లకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. ఆదివారం కావడంతో చీరాల వాడరేవు, రామాపురం బీచ్ తదితర ప్రదేశాలకు యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం కానిస్టేబుల్ సుబ్బారావు రామాపురం సముద్ర తీరంలో ప్రజలను యాత్రికులను అప్రమత్తం చేస్తున్నారు.



## గ్రంథాలయంలో చిన్నారులకు పోటీలు

ఒంగోలు కల్చరల్, మేజర్‌న్యూస్: జిల్లా కేంద్ర గ్రంధాలయం ఒంగోలు నందు సంపూర్ణ కాళహస్తి ఇంచార్జి డిప్యూటీ లైబ్రేరియన్ ఆధ్వర్యంలో చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధులు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 68వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పలువురు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు మోటివేషన్ క్లాసులు బుక్ షో, చదవడం రాయడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్‌కె సిద్ధాంబి, చల్ల నాగేశ్వరమ్మ, అభివృద్ధి కమిటీ సభ్యులు సిహెచ్ కోటేశ్వరరావు, సరయు డెంటస్ట్, రవి డిసిఎల్ ఒంగోలు సిబ్బంది విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

## యువత సృజనాత్మకంగా ఆలోచించాలి



ఒంగోలు, మేజర్‌న్యూస్:గ్రామీణ యువత విద్యా నైపుణ్యాలు, మానసిక ధైర్యంతో పాటు సృజనాత్మకంగా ఆలోచించే విధానంతో ఎదగాలని, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గాదంశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమ సమావేశంలో మాట్లాడుతూ గాదంశెట్టి శ్రీనివాసులు విద్యార్థులకు ఒక సూచన చేశారు. చదివే నైపుణ్యాలను దృష్టిలో పెట్టుకొని సృజనాత్మకంగా ఆలోచించాలని తెలుపుతూ మానసిక దృఢత్వంతో ఈ ప్రపంచంలో ఎందరో వ్యక్తులు తమకు మించిన పనులు ఎన్నో చేశారని ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని విద్యార్థులకు ఉపకరించేలా తయారు చేశారని అలాగే సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకున్న విద్యార్థులకు స్టార్ అప్ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించి ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ మాకినేని అమరశింహం, క్విజ్ కాలేజీ అధినేత కళ్యాణ చక్రవర్తి సేగ్గం శ్రీనివాసరావు, క్విస్ కాలేజి లెక్చరర్స్, టూటర్స్ పాల్గొని మంకీ బాత్ కార్యక్రమాన్ని వీడియో ద్వారా చూయించి విద్యార్థులను ఆనందపరిచారు.

## ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి లక్ష విరాళం

కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కోసం కనిగిరి మండలం రాగిమానిపల్లి గ్రామానికి చెందిన ఎనిమిరెడ్డి బాలకోటయ్య ఒక లక్ష రూపాయలు చెక్కును ఒంగోలు పార్లమెంట్ టీడీపి అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఆదివారం అందజేశారు .ప్రభుత్వాసుపత్రిలో పేద ప్రజలకు మెరుగైన వసతులు కల్పన కోసం లక్ష రూపాయలు విరాళం అందజేసిన బాలకోటయ్యను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, బాలు ఓబులు రెడ్డి, దానియేలు తదితరులు ఉన్నారు.



# ఉయ్యాలవాడకు నివాళులర్పించిన జిల్లా ఎస్పీ

సూర్యప్రతినిధి, బాపట్ల



తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, 1857సిపాయిల తిరుగు బాటుకు పదేళ్ల ముందే, 184647కాలంలోనే బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు వ్యతిరేకంగా రాయలసీమలో సాయుధ పోరాటంచేసిన ధీశాలి నరసింహారెడ్డి అని కొని యాడారు. నరసింహారెడ్డి శౌర్యం, తెల్లదొరలపై ఆయన చేసిన ధైర్య సాహసాల పోరాటం తెలుగు వారి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ నారాయణ, ఆర్ఐ మౌలుద్దీన్, చుండూరు సీఐ ఆనందరావు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేర నియంత్రణ లక్ష్యంగా కార్డన్ సెర్చ్

**సరైన పత్రాలు లేని 29 మోటార్ సైకిళ్లు, 5 ఆటోలు స్వాధీనం**




అద్దంకి మేజర్‌న్యూస్: శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి డిఎస్పీ బి. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అద్దంకి టౌన్‌లోని గరటయ్య కాలనీ పరిసర ప్రాంతంలో విస్తృత స్థాయిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ఆదివారం తెల్లవారుజామున నిర్వహించారు. ఈ తనిఖీల్లో దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ, అద్దంకి సీఐ సుబ్బరాజు, ఎస్సైలు, 38 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ పరికరాల ద్వారా అనుమానితుల తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు, ఇతర ప్రదేశాలను సోదాలు చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 29 మోటార్‌సైకిళ్లు, 5 ఆటోలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొందరు వాహన యజమానులకు చలానాలు విధించారు. తదనంతరం "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్డాన్ సెర్చ్‌లో బల్లికురవ ఎస్సై నాగరాజు, సంతమాగులూరు ఎస్సై పట్టాభి రావు, కొరిశపాడు ఎస్సై సురేష్, కె.కె.మెట్ల ఎస్సై రఫీ, తాళ్లూరు ఎస్సై మల్లికార్జున, దొనకొండ త్యాగరాజు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ధ్యానంతో బహుళ ప్రయోజనాలు



**చిన్మయమిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య**

ఒంగోలు కల్చరల్, మేజర్‌న్యూస్: ధ్యాన శిక్షణ వల్ల శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్పులు సాధించ గలిగేలా దోహదపడుతుందని చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు కొండమీద శ్రీ గిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి గో క్షేత్ర భవన్‌లో ఏర్పాటైన శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులలో పవిత్ర చైతన్య పాల్గొని విద్యార్థులకు ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు ధ్యాన సాధన చేయించారు. హనుమాన్ చాలీసా ప్రాముఖ్యతను తెలియ చెప్పారు. అంత్యాక్షరి పోటీలో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు. మార్చి 1వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీగిరిలో జరిగే అఖండ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, భక్తులు, సంప్రదాయ వస్త్రాలతో పాల్గొనాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

## ఒంగోలులో మూడు రోజులకొకసారి

# ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలి




ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలు నగర శివారు కాలనీలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రతి మూడు రోజులకు ఒకసారి సరిపడా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం ఒంగోలు నగర పార్టీ సభ్యులకు నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. నగరంలోని సుమారు 60 శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతోందని, ప్రస్తుతం వారానికి ఒక్కసారి మాత్రమే ఇంటికి రెండు డ్రమ్ముల చొప్పున నీరు ఇస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమానికి దిగుతామని సిపిఎం నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు జి రమేష్, తంబి శ్రీనివాసులు, ఎస్‌డీ హుస్సేన్, ఎన్ వీరాస్వామి, బివి రావు, కె శ్రీనివాసరావు, డి వెంకటేశ్వర్లు, జి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## దళిత సేవా ఫౌండేషన్ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులుగా అత్యాల గంగయ్య

చీమకుర్తి, మేజర్‌న్యూస్: దళిత సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చింతలపాలెం యలమందబాబు ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. దళిత సేవా ఫౌండేషన్ సభ్యులు అందరూ కలిసి చీమకుర్తి మండలం పి.నాయుడుపాలెం గ్రామానికి చెందిన అత్యాల గంగయ్యను దళిత సేవా ఫౌండేషన్ ప్రకాశం జిల్లా ఉధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత సేవా ఫౌండేషన్ ప్రకాశం జిల్లా గౌరవ సలహాదారులు జంద్రాజుపల్లి ఇశ్రాయేలు, రావినూతల అభినయ్, తొరటి సామ్యేలు, తొరటి పవన్, అత్యాల అజయ్, సోమా జోసఫ్, తొరటి పిచ్చయ్య, తోరటి జాన్, తోరటి అరుణ, తొరటి సుజాత, తొరటి వినోద్, తొరటి ప్రభమ్మ, తొరటి లీలారాజు, తొరటి మనోహర్ పాల్గొన్నారు.

## త్రైత్ర సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం




సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: సర్వమతాలకు సంభందించి త్రైత్రసిద్ధాంత గ్రంధాలు ముద్రించినట్లు త్రైత్ర సిద్ధాంతం ప్రభోదా సేవాసమితి ఇందు జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని కె.అగ్రహారం, చింతపూడు, రెడ్డిగారికొత్తపల్లె పంచాయతీల పరిధిలో త్రైత్ర సిద్ధాంతం గ్రంథములపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రథమ, ద్వితీయ, తృతీయ గ్రంధాలుగా భగవద్గీత, బైబిల్, ఖురాన్ అమలులో ఉన్నట్లు సర్వమతముల త్రైత్ర సిద్ధాంతం ఆధ్యాత్మికతతో సర్వమతాలు ఒకటే అని త్రైత్ర గ్రంధాల్లో ధర్మం ఒకటేనని భగవద్గీత, బైబిల్, ఖురాన్ ఆత్మజ్ఞానం తెలియజేస్తాయని అన్ని మతాలు త్రైత్ర గ్రంధాలు అన్ని సమానమని అర్థం చేసుకోవాలని తెలిపి త్రైత్ర సిద్ధాంతం గ్రంధాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జి.ప్రసాద్, జి.సుధాకర్, కె.వెంకటేశ్వరరెడ్డి, నరసింహులు, నాగమ్మ, మధు, రమణారెడ్డి, మధుసూదనరావు, అనూష పాల్గొన్నారు.

## ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళి

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్టెప్ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్టెప్ సిఈఓ పి. శ్రీమన్నారాయణ పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్, స్టెప్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# గోవా పర్యాటక విధానం బాపట్లకు ఆదర్శం

సూర్యప్రతినిధి, బాపట్ల

జిల్లాలో తీర ప్రాంత పర్యాటక రంగ అభివృద్ధి లక్ష్యంగా మూడు రోజుల పాటు గోవా రాష్ట్రంలో అధ్యయన పర్యటన చేపట్టిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ బృందం శనివారం పర్యటనను ముగించింది. ఈ సందర్భంగా బృందం గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ ను మర్యాదపూర్వకంగా కలిసింది. దేశంలో గోవాను ప్రముఖ పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దిన విధానంపై కలెక్టర్ బృందం హర్షం వ్యక్తం చేసింది. పర్యటన సందర్భంగా అక్కడి అధికారులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున గోవా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శాలువా కప్పి సత్కరించి, శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని జ్ఞాపికగా అందజేశారు.



ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందజేయగా, గోవా పర్యాటక విధాన పుస్తకాన్ని ముఖ్యమంత్రి కలెక్టర్ బృందానికి అందించారు. సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధిలో తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ముఖ్యమంత్రి సూచించారు. నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, భవిష్యత్తులో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. గోవా పర్యటనలో పొందిన అనుభవాలను బాపట్ల తీర ప్రాంత అభివృద్ధిలో అమలు చేస్తామని కలెక్టర్ బృందం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో అమలవు తున్న ఈ-పాలన విధానం ప్రశంసనీయమని గోవా ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఏపీలో సాంకేతిక ఆధారిత డిజిటల్ సేవల ద్వారా అమలవుతున్న పరిపాలనా విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు గోవా అధికార బృందం త్వరలో ఆంధ్రప్రదేశ్ లో పర్యటిస్తుందని తెలిపారు. ఈ పర్యటనలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథ రెడ్డి, చీరాల తహసీల్దార్ కె. గోపికృష్ణ, ఎంపీడీవో ఎం. రాజేష్ బాబు, జిల్లా పర్యాటక అధికారి అలీ అస్గర్ షేక్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రాజెక్టు మేనేజర్లు శివ శరణ్, షేక్ సజిత్ పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సూర్యప్రతినిధి, బాపట్ల

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీల పై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని,జిల్లా కలెక్టరేట్ తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్ లో, మండల తహశీల్దార్ల కార్యాలయాలలో ను తహశీల్దార్లు, ఎంపీ డి ఓ లు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం



తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని, Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని, పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



# అనారోగ్యంతో బాధపడుతున్న వారు పిజిఆర్ఎస్‌కు తీసుకురాకండి

సూర్యప్రతినిధి, బాపట్ల

నడవలేని,మంచాలకు పరిమితం అయ్యి, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎవ్వరు కూడా పి జి ఆర్ ఎస్ కు తీసుకురావద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజల సమస్యల అర్జీల ను ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. పి జి ఆర్ ఎస్ లో సమస్యల అర్జీలు అందజేసే అందుకు అనారోగ్యంతో బాధపడుతున్న నడవలేని వారిని, మంచాలకు కు పరిమిత అయ్యని వారిని ఎవ్వరూ కూడా పి జి ఆర్ ఎస్ కు తీసుకురావద్దని,అలాంటి వారికి సంబంధించిన సమస్యలు ఉంటే వారి తరుపున వారు వచ్చి అర్జీలను అందజేయవచ్చునన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి జిల్లా కలెక్టరేట్ కు పిజిఆర్ ఎస్ లో సమస్యల అర్జీలు అందజేయాడానికి ద్విచక్ర వాహనంపై వచ్చే వారు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకొని రావాలన్నారు.జిల్లా కలెక్టరేట్ తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్ లో మండల తహశీల్దార్ల కార్యాలయాలలో ను తహశీల్దార్లు, ఎంపీ డి ఓ లు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

# అద్దంకిలో సందడిగా హ్యాపీ సండే ప్రారంభం

అద్దంకి, మేజర్‌న్యూస్: అద్దంకి లో ఃహ్యాపీ సండేః కార్యక్రమం సందడి వాతావరణం లో ప్రారంభమయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి నెల 2, 4 ఆదివారాల్లో హ్యాపీ సండే కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంది. ప్రారంభోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 7 నుంచి 9గంటల వరకు ఈకార్యక్రమం చేపట్టారు.



పురపాలక కమిషనర్ డీ రవీంద్ర, మేనేజరు శ్రీదేవి, మెప్మా సీఓ శ్రీలత, పురపాలక సిబ్బంది, ఔత్సాహికులు, గార్లపాటి శ్రీనివాసరావు, గుంటూరు మాధవరావు,తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. చిన్నారుల భరతనాట్యం, పెద్దల సంగీత విభావరి, చెన్నుపల్లి నాగేశ్వరరావు బృందం కోలాట ప్రదర్శన చేశారు. సంగీతవిభావరిలో పాటలు పాడిన గాయకుడు శేషగిరిరావుకు రొటేరియన్ గూడా మహాలక్ష్మిరెడ్డి నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిని కమిషనర్, మేనేజరు, ఇతర సిబ్బంది అభినందించారు. ఇకపై ప్రతి సచివాలయం పరిదిలో ఈకార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# కేంద్రమంత్రి చేతులమీదుగా యాక్సెస్ పాస్‌కార్డు అందుకున్న బీఆర్కె

నిజాంపట్నం, మేజర్‌న్యూస్: మత్స్యకారులు సముద్రంలో మత్స్య సంపద మీద ఆధారపడే అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత ప్రభుత్వం గత సంవత్సరం నవంబర్ 4వ తేదీన గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎక్స్క్లూజివ్ ఎకనామక్ జోన్ ప్రత్యేక ఆర్థిక మండలి విధానం కింద మత్స్యకారులు, అగ్నికుల క్షత్రి యలను యాక్సెస్ పాస్ కార్డులు జారీకి మొదలు పెట్టారు. ఈ కార్యక్రమం ఈనెల 20వ తేదీన గుజరాత్లో వరేవల్ పోర్టు వద్ద కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అధికారకంగా ప్రారంభించారు. దేశంలోనే సముద్రతీర పోర్టులు ఉన్న ప్రాంతాలలో 30 మందిని రాష్ట్రానికి ఇద్దరు చొప్పున మత్స్యకార ప్రతినిధులు ఈ కార్యక్రమం పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి స్వర్ణాంధ్ర అసోసియేషన్ బోట్ యూనియన్ అధ్యక్షులు బొమ్మిడి రామకృష్ణ, మరియు వైజాగ్ బోటు ఓనర్స్ యూని యన్ అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు హాజరై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదగా యాక్సెస్ పాస్ కార్డులు అందుకున్నారు.





ఈ సందర్భంగా బొమ్మిడి రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఈ జెడ్ విధానం ద్వారా భారత సముద్ర సరిహద్దుల్లో డీఫ్ సీ ఫిషింగ్ కు మరింత అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ పథకం ద్వారా మత్స్యకారులకు సంపదకు ఆదాయం పెరుగుతుం దన్నా రు. సహకార సంఘాల ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని చెప్పారు. బోటు యజమానులందరూ అవసరమైన పత్రాలతో ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకుంటే కార్డులు జారీ చేస్తారని త్వరలో బాపట్ల ,నిజాంపట్నం లోని బోటు ఓనర్స్ కు యాక్సెస్ పాస్ కార్డులు జారీకి చర్యలు చేపడుతున్నట్లు రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కేంద్రం మంత్రి చేతులు మీదుగా యాక్సెస్ పాస్ కార్డు అందుకున్న బొమ్మి డి రామకృష్ణను మంత్రి అనగాని సత్యప్రసాద్, టిడిపి నేత అనగాని శివప్రసాద్, నాయకులు పంతాని మురళీధర్ రావు, నాయ కులు, మత్స్యకరులు, గ్రామస్తులు, అభినందనలు తెలిపారు.



## అంగరంగ వైభవంగా అభయాంజనేయ స్వామి ప్రతిష్ట

వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని రామన్నపేట పంచాయితీ బాపయ్యనగర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం 10.18 గంటలకు గర్భగుడిలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణం జై హనుమాన్ నినాదాలతో మార్మోగింది.ముందురోజు విగ్రహాన్ని సమీప గ్రామాల పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకువెళ్లగా భక్తులు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కోలాట సమాజం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జలదివాసం, ధాన్యదివాసం, శయ్యాధివాసం, గణపతి పూజ, చండీ పూజ, హోమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. దాతలు కోడూరి కిరణ్‌కుమార్, తిరుమలశెట్టి కోటేశ్వర రావు, దోగుపర్తి మల్లికార్జునరావు, చల్లా జనార్ధనరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదం, అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, భక్తులు భారీగా పాల్గొన్నారు.



## సింగరకొండలో అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ ప్రత్యేక పూజలు

అద్దంకి, మేజర్‌న్యూస్: అద్దంకి మండలంలోని సింగర కొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ పారా శ్రీరామ్ మూర్తి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన ఆయన ముందుగా ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలోని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వారిని అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదములు అందజేసారు. పాలక మండల అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకర్ రావు స్వామివారి ఫోటో, శేష వస్త్రము ఇచ్చి ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో అద్దంకి మెడికల్ అసోసియేషన్ సభ్యులు చవట శ్రీనివాసరావు , నాగసూరి బాలకృష్ణ, కొత్త మాసు సుధాకర్, క్రాంతి గ్రూప్స్ ఆఫ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



## అభయాంజనేయ మహా కుంభాభిషేకం

చీరాల మేజర్ న్యూస్ చీరాల పట్టణం 20వ వార్డు బోస్‌నగర్‌లో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి మహా కుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో AMC చైర్మన్ కౌతరపు జనార్ధన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, గుమ్మా వెంకటేష్, పిక్కి నారాయణ, వెంకట్రావు, నాగు తదితర నాయకులు పాల్గొన్నారు.

# సీఎం బహిరంగ సభాస్థలాన్ని పరిశీలించిన కలెక్టర్





సూర్య ప్రతినిధి, మార్కాపురం, మేజర్‌న్యూస్: పట్టణంలోని సాయి బాలాజీ పాఠశాల ఎదురు ఈనెల 25వ తేదీన జరగబోవు ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఇతర అధికారులు ఆదివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయం సమీపంలోనే సీఎం హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సభ ప్రాంగణానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా సీఎం చేరుకునే విధంగా చర్యలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఇంచార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు తదితరులు ఉన్నారు.

# మంత్రుల ఆత్మీయ కలయికలో కదిరి బాలకృష్ణ



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర రహదారులు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలను కదిరి బాబురావు విద్యాసంస్థల కోశాధికారి కదిరి బాలకృష్ణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చిన్నతనం నుండి క్లాస్ మేట్స్‌గా కలిసిమెలిసి ఉన్న మంత్రులు పార్థసారథి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అదేవిధంగా కదిరిబాలకృష్ణ ఆదివారం హైదరాబాదులోని కోమటిరెడ్డి నివాసంలో కలుసుకుని పలు విషయాలను చర్చించుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి మధురస్మృతులను పంచుకుని ఒకరికొకరు ఆప్యాయంగా ఆనందంగా ఆదివారం గడిపారు. ఈ కార్యక్రమంలో కదిరి బాలకృష్ణ, మంత్రులు కొలుసు పార్థసారథి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బిల్డర్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు ప్రభుత్వ బాధ్యత

**పోస్టుమార్టం గది నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి**

పామూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని పామూరు ప్రభుత్వాసుపత్రి పరిధిలో రూ.38,73,000తో నూతనంగా నిర్మించబోయే పోస్టుమార్టం గది కోసం కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి భూమి పూజ నిర్వహించారు. భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.



భవనం పూర్తయిన తర్వాత పామూరు ఆసుపత్రి మరింత సమగ్ర, నాణ్యమైన వైద్య సేవలు అందించగలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు (బిల్డర్), గుంటుపల్లి శ్రీనివాసులు, సయ్యద్ అమీర్ బాబు, షేక్ గౌస్ బాషా, సాంబశివరావు, మోబినా మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపిలోకి వైసిపి కుటుంబం

**మంత్రి స్వామి సమక్షంలో టిడిపిలో చేరిక**



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని వర్దినేని వారి పాలెం గ్రామానికి చెందిన మేక మాల్యాద్రితోపాటు ఎనిమిది కుటుంబాలు ఆ గ్రామ టిడిపి సర్పంచ్ గాలి సందీప్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ పార్టీలో చేరిన వారిని మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 20 నెలల్లో మన ముఖ్యమంత్రి చేపడుతున్న పథకాలే అభివృద్ధి వైసీపీలో నుంచి పార్టీలో చేరుతున్నారని మరోసారి గుర్తు చేశారు. వీరితోపాటు కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, మండల పార్టీ కన్వీనర్ పోకూరి రవీంద్రబాబు, గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# శ్రీనారాయణస్వామి దేవస్థానంలో విశేషపూజలు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారి అభిషేకం విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో నెలకొల్పి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీగిరిరాజనరసింహబాబు అధ్వర్యంలో దేవస్థానం ప్రధాన అర్చకులు యం.ప్రసాదుశర్మ పంచామృత ఫలాభిషేకం పూజలు నిర్వహించి అనంతరం స్వామివారి మూలవిరాట్టును ఇతర దేవతామూర్తులను పట్టువస్త్రాలు పూలమాలలతో



అలంకరణ చేసి పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం ఆవరణలో గోమాతను పూజించి గోపూజా కార్యక్రమం తదుపరి దేవస్థానం అధ్వర్యంలో భక్తులతో కలిసి స్వామివారికి మహానైవేద్యం సమర్పించి పూజలు చేసి కర్పూరహారతులు ఇచ్చారు. అనంతరం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఓ శ్రీగిరిరాజనరసింహాబాబు, పలువురు భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# సముద్రతీరంలో 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర'




ఒంగోలు, మేజర్‌న్యూస్: జిల్లా కేంద్రమైన ఒంగోలు లోని ఆంధ్ర కేసరి విశ్వావిధ్యాలయం, ఆదిత్యా కాలేజీ ఒంగోలు యన్.యస్.యస్ వాలంటీర్లు ఆదివారం యన్.యస్.యస్ ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డాక్టర్ మండే ప్రయతం దేవ్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద్ర స్వర్ణంద్ర ఒక రోజు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.వి ఆర్. మూర్తి వాలంటీర్లు ఉద్దేశించి మాట్లాడుతూ స్వచ్ఛత యాక్షన్ ప్లాన్‌వన్ డే మాసివ్ క్లినిక్ ప్రోగ్రామ్ విజయవంతం చేసినందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. కొత్తపట్నం సముద్ర తీరాన ఆంధ్రా కేసరి విశ్వ విద్యాలయం యన్.యస్.యస్ వాలంటీర్లు, ఆదిత్య కాలేజీ యన్.యస్.యస్ వాలంటీర్లు సంయుక్తంగా స్వచ్ఛ భారత కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్టర్ ఆఫ్ యూత్ అఫ్పైర్స్, యన్.యస్.యస్ రీజినల్ డైరెక్టరేట్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వర్తించారు. కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ అధ్యక్ష ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కె.సురేష్ యన్. యస్. యస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ యన్ శ్రీనివాస్,ఆంధ్రా కేసరి విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం అధ్యాపకురాలు యన్.ప్రసన్న లక్ష్మీ, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యక్షురాలు యం.ప్రభావతి యన్.యస్.యస్ వాలంటీర్లు సీనియర్ విద్యార్థులు యస్. రెహమాన్, గ్లోరి, మెరైన్ సి.ఐస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం', 'రెవెన్యూ క్లినిక్'లు నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**



ఒంగోలు, మేజర్‌న్యూస్: మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి . రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 23వ తేదీన సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పరీక్ష కేంద్రాలు సందర్శించిన సిఐ, ఎస్ఐ

కొమరోలు, మేజర్ న్యూస్: మండల కేంద్రమైన కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఆదివారం గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, స్థానిక ఎస్సై నాగరాజుతో కలిసి సందర్శించారు. పరీక్షల నిర్వహణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసు సిబ్బందికి పరీక్షా నిర్వహణ అధికారికి తెలిపారు. అంతేకాకుండా పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని ఈ విషయాన్ని ప్రజలు గమనించి ఆ ప్రాంతాలలో గుంపులుగా ఉండవద్దని సీఐ తెలిపారు. అంతేకాకుండా ఇప్పటికే పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు నెట్ సెంటర్లను స్వచ్ఛందంగా మూసివేయాలని నోటీసులు ఇచ్చినట్లు సిఐ రామకోటయ్య చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద కాపీలను ప్రోత్సహించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యల తప్పవని సీఐ తీవ్రంగా హెచ్చరించారు.



సూర్య
www.suryaa.com
PRAKASAM ప్రకాశం MARKAPURAM మార్కాపురం BAPATLA బాపట్ల




## 'సామ్రాజ్యవాదం నిన్న-నేడు' అంశంపై సెమినార్

ఒంగోలు, మేజర్‌న్యూస్ : దేశంలోని కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడేందుకే మోడీ ప్రభుత్వం అమెరికాకు దాసోహం ఉంటుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. వ్యవసాయ కార్మికోద్యమనేత, మాజీ శాసనసభ్యులు తవనం చెంచయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎల్బీజీ భవన్‌లో 'సామ్రాజ్యవాదం నిన్న - నేడు' అనే అంశంపై సెమినార్ జరిగిన సెమినార్‌కు జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ తవనం చెంచయ్య తన జీవితమంతా అంటరానితనం నిర్మూలన కోసం, అనగారిన వర్గాలపై దాడులు దౌర్జన్యాలు అంతం కోసం పోరాడారని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య, మొండ్రు ఆంజనేయులు, జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు, టి.సుజాత, ఎం.సుబ్బారావు, కంచర్ల సుధాకర్, జి.చెన్నకేశవులు, చలపతి, భాస్కర్, రవి, కోటేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా నాయకులు యన్. మాలతి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి



సూర్య ప్రతినిధి, మార్కాపురం, మేజర్‌న్యూస్: మార్కాపురం జిల్లా రెడ్డి సంక్షేమ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ఆదివారం రెనాటి సూర్యుడు, బ్రిటిష్ వారికి భయం చూపించిన మొనగాడు, తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ స్వతంత్రం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరుడు, మన తెలుగు ముద్దుబిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి వేడుకలు మార్కెట్ యార్డ్ దగ్గరలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జంక్షన్‌లో ఆయన విగ్రహానికి మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ అయినటువంటి గుంటక సుబ్బారెడ్డి పూలమాల వేసి ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి జోహార్లు అనే నినాదంతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పూలకు, పూలమాలకి, బొమ్మిరెడ్డి సత్యనారాయణ రెడ్డి సహకారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ కర్ణ వెంకట నరసింహారెడ్డి, గౌరవ అధ్యక్షులు వెన్న వెంకట రెడ్డి, మార్కాపురం టౌన్ అధ్యక్షులు తిరుమలరెడ్డి వెంకటరామిరెడ్డి, రూరల్ అధ్యక్షులు కుందూరు రమణారెడ్డి, గోగిరెడ్డి వెంకట నారాయణ రెడ్డి, ఆర్.వి.సుబ్బారెడ్డి, రావి చెంచిరెడ్డి, దగ్గుల ఓంకార్ రెడ్డి, గోరంట్ల చిన్న వెంకటరెడ్డి, ఆర్ అండ్ బి రమణారెడ్డి, ఎస్.రమణారెడ్డి, చిట్టి రెడ్డి నరసింహారెడ్డి, గోలమారి కాశిరెడ్డి, చదలవాడ రామిరెడ్డి, కొమ్మిరెడ్డి రామకృష్ణారెడ్డి,బత్తుల వెంకటరెడ్డి, కుందూరు మల్లారెడ్డి, కె.బలరాం రెడ్డి, జె.నాగి రెడ్డి, సాదుల యోగి రెడ్డి, రెడ్డి సోదరులు పాల్గొన్నారు.

## తవనం చెంచయ్య, పమిడి కోటయ్యలను ఆదర్శంగా తీసుకోవాలి

### – సిపిఎం జిల్లా కమిటీ పిలుపు –

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రకాశం జిల్లాలో మార్క్సిస్ట్ పార్టీ నిర్మాణానికి విశేష కృషి చేసిన పమిడి కోటయ్య, తవనం చెంచయ్యలను ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వారి వర్ధంతి సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వారి సేవలను స్మరించుకున్నారు. పార్టీ సీనియర్ నాయకులు జాలా అంజయ్య మాట్లాడుతూ జిల్లాలో సిపిఎం నిర్మాణానికి కోటయ్య చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కె మాబు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు ఎవి పుల్లారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు పెంట్యాల హనుమంతరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు జి. రమేష్, జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అనంతబాబును జగన్ సస్పెండ్ చేయాలి: దారా అంజయ్య

ఒంగోలు, మేజర్‌న్యూస్ : దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును ఇప్పటికైనా దళిత ఉద్ధారకుడు జగన్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి డిమాండ్ చేశారు. ఆదివారం సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సుప్రీం కోర్ట్ తీర్పు జగన్ దళిత అంతకులకు గొడుగు పట్టిన వైనాన్ని వెల్లడి చేసిందన్నారు. 22వ సంవత్సరం మే 19వ తేదీ వీధి సుబ్రహ్మణ్యాన్ని అను దళిత డ్రైవర్ను హత్య చేసి వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేశారన్నారు. దళితుల ఆందోళనలు రాష్ట్రమంతా జరిగిన దళిత రక్షకుడు జగన్ మాత్రం చెల్లించలేదని అన్నారు. శుక్రవారం సుప్రీంకోర్టు వీధి సుబ్రహ్మణ్య హత్య కేసులో రాష్ట్ర ప్రభుత్వ డీజీపీ వైఖరిని తప్పు పట్టిందన్నారు. ఈ హత్య కేసులో అప్పటి డి.ఎస్.పి, సిఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలని ఆదేశించిందన్నారు. అలాగే ఈ కేసులో వీధి సుబ్రహ్మణ్యం భార్య కూడా ఉందని సీట్ నిర్ధారించిందని వెంటనే ఆమెను కూడా అరెస్టు చేయాలని



సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు . దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ రాగాలు తీసి దళిత వంచక జగన్ ఇప్పటికైనా దళిత అంతకుడు వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబును పార్టీ నుండి సస్పెండ్ చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి తదితరులు డిమాండ్ చేశారు.

# దేవుడితో ఆటలొద్దు జగన్!!

**మొదటి పేజీ తరువాయి**

లడ్డులో కల్తీ జరిగింది వాస్తవమేనని మాట్లాడితే జగన్మోహన్‌రెడ్డి మాత్రం కల్తీ జరగలేదని బుకాయిస్తున్నారు. అసలు వైసీపీ ప్రభుత్వ హయాంలో తయారు చేసిన తిరుమల ప్రసాదం లడ్డూలలో నెయ్యేలేదు. సిట్‌లో ఏమీ లేదని మాట్లాడుతున్నారు దేవుడి మీద జగన్‌కు, వైసీపీ నేతలకు విశ్వాసం లేదు. శాసనమండలిలో చెప్పులు వేసుకొని వెంకటేశ్వర స్వామి పటం తేవడం పద్ధతి కాదు. ఇది రూలింగ్ కాదని సభ వాయిదా వేసి వెళ్లినప్పటికి వైసీపీ సభ్యులు గొడవ సృష్టించారు. వైసీపీ సభ్యులు సభకు వచ్చినప్పుడు చెప్పులేసుకుని వెంకటేశ్వరస్వామి పటం చేతుల్లో పట్టుకొని జైజగన్ అంటూ నినాదాలు చేశారు ఇది ఎంతవరకు సమంజసం? సభకు ఫోటోలు తీసుకురావడం క్షమించరాని నేరం. బయటకు వెళ్తూ బల్లల మీద వేంకటేశ్వరస్వామి పటాలను విసిరేసి వెళ్లారు. దేవునితో పెట్టుకున్నారు 11 అయిపోయారు. నాడు రామతీర్థంలో రాముడి తల నరికారు చంద్రబాబు వెళ్తుంటే వెళ్లనివ్వలేదు. వైసీపీ వ్యహారశైలి ప్రజలు



గమనిస్తున్నారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ అత్యున్నత చట్టసభ శాసన మండలిలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి చిత్రపటాల పట్ల వైసీపీ నాయకులు ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని తెలిపారు. దేవుడి చిత్రపటాలను బూట్లు, చెప్పులతో పట్టుకోవడం, అనంతరం వాటిని నిర్లక్ష్యంగా విసరడం అత్యంత హేయమైన చర్య. ప్రజల విశ్వాసాలు, ఆధ్యాత్మిక విలువలు, సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి బాధ్యతని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, మత సామరస్యాన్ని దెబ్బతీసే విధానాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అన్ని మతాలను గౌరవిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

# ఒంగోలులో 'స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్'

**మొదటి పేజీ తరువాయి** తోపుడు బండ్లు ఉన్నాయి. వీటి వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది వస్తోంది. ఈ క్రమంలో ప్రధాన వీధుల వెంట ఉన్న చిన్నచిన్న వ్యాపారులందరినీ ఒకచోటకు చేర్చి అక్కడే వారి వ్యాపారాలు చేసుకునే విధంగా ప్రోత్సహించేందుకు నగరపాలక సంస్థ ఏర్పాట్లు చేస్తుంది. మామిడిల పాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద వంద దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. కంటైనర్‌లలో ఈదుకాణాలు ఉంటాయి. ఒక్కో కంటైనర్‌కు 4షాపులు ఉంటాయి. మొత్తం 25 కంటైనర్‌లలో 100 దుకాణాలను నెలకొల్పుతారు. స్వయం సహాయ సంఘాలలోని మహిళలు వీటిని నిర్వహిస్తారు. ప్రతి దుకాణంలో కింద భాగాన ఫుడ్ తయారి ఉంటుంది. పైన ప్రజలు వాటిని ఆరగించేలా కంటైనర్‌ల డిజైన్‌లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే ఈ కంటైనర్‌లు అందుబాటులోకి రానున్నాయి.

**రూ.4.50 కోట్లతో ఏర్పాటుకు సన్నాహాలు**

ఈ వంద దుకాణాలను ఏర్పాటు చేసేందుకు రూ.4.50 కోట్లు ఖర్చు అవుతోందని అధికారులు అంచనా వేశారు. నగరపాలకసంస్థ సాధారణ నిధులు రూ.2.90కోట్లు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1.50 కోట్లు. మెప్మా నుంచి రూ.10 లక్షలు ఇందుకోసం కేటాయిస్తారు. పానీ పూరీ నుంచి బిర్యానీ వరకు అన్నీ ఈ స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌లో దొరికేలా ఏర్పాటు చేస్తారు. బ్యాంకు లింకేజీ డబ్బుతో షాపుల ఏర్పాటు కాబట్టి స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళల జీవనోపాధిని పెంచాలనే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఫుడ్‌కు సంబంధించిన ప్రతిదీ ఇక్కడ విక్రయించేలా ఏర్పాటు చేస్తారు.

**ఏం తినాలన్నా ఒకేచోట...**

నగర వాసులు ఏం తినాలన్నా ఈ స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌లో దొరికేలా ప్లాన్ చేశారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఈ దుకాణాలలో వ్యాపారాలు జరుగుతాయి. ఏమైనా తినాలన్నా నగర వాసులు అక్కడికే వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మామిడిపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకును వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేశారు. అక్కడే ఓపెన్ జిమ్, యోగా సెంటర్ కూడా ఉంది. కుటుంసభ్యులతో సాయంకాల వేళల్లో కాసేపు సరదాగా గడపాలనుకునే వారు ఇక్కడికి వచ్చి వారికి కావాల్సింది కొనుగోలు చేసి ఆరగించి, చెరువు పరిసరాలలో సేదతీరిందుకు వీలుగా స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ప్రజల ముందుకు రానుంది. ఈపాటికే మామిడిపాలెం సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు పరిసరాలు అభివృద్ధి చెందుతున్నాయి. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ రాకతో ఆప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందని అధికారులు చెబుతున్నారు. రానున్న కొద్ది మాసాలలోనే స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ఒంగోలులో ఏర్పాటు కానుంది.

## ఆలయాభివృద్ధికి డాక్టర్ ఆర్ఎస్ఎస్ అండ

### భక్తుల సౌకర్యానికి త్రాగునీటి డ్రమ్ముల సమకూర్చింపు

### ఆలయ పరిశుభ్రతకు పనిముట్ల విరాళం



పామూరు, మేజర్‌న్యూస్: పులివెందులలోని ప్రసిద్ధ శ్రీ రంగనాథ స్వామి ఆలయం అభివృద్ధికి స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ఎస్ఎస్ తన సేవా చైతన్యాన్ని చాటుకున్నారు. ఆయన దాతృత్వం, భక్తి పరిరక్షణలో ప్రతిష్టాత్మకంగా నిలిచింది. డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణ పరిశుభ్రతకు అవసరమైన వివిధ రకాల పనిముట్లను విరాళంగా అందజేశారు. పిచ్చిమొక్కలు, గడ్డి, చెత్తచెదారాలను తొలగించేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. వేసవి వేడి దృష్ట్యా భక్తుల దాహం తీర్చేందుకు త్రాగునీటి డ్రమ్ములను కూడా సమకూర్చారు. ఆలయ సేవ అనేది నా ధర్మం. పరిశుభ్రతే పరమ భక్తి అని డాక్టర్ ఆర్ఎస్ఎస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం రంగనాయకులు, ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, ఈవో వెంకటరమణ, విద్యాసంస్థల ప్రతినిధులు, ఆలయ ప్రధాన అర్చకులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేరం గరుడాచలం ఆశయాల దిశగా తూర్పుసత్రం అభివృద్ధి





బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణంలోని తూర్పు సత్రాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. పట్టణంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆదివారం విచ్చేసిన తులసి రామచంద్ర ప్రభు, ఉగ్గిరాల సీతారామయ్యలను, బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్, తూర్పు సత్రం చైర్మన్ గుంటుపల్లి తులసి కుమారి సత్రానికి ఆహ్వానించారు.తులసి రామచంద్ర ప్రభు, ఉగ్గిరాల సీతారామయ్యలు సత్రానికి వచ్చేశారు, సందర్భంగా మహనీయుడు పేరం గరుడాచలం నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.సత్రం ఆవరణలోని భవనాలు, వసతులు, నిర్వహణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి రోజువారీ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన మరమ్మతులు తదితర అంశాలపై వివరాలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా తులసి రామ చంద్ర ప్రభు మాట్లాడుతూ, పేరం గరుడాచలం నాయుడు కలలు కన్న ఆశయాలు ఎంతో గొప్పవని పేర్కొ న్నారు. పేద ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచేలా సత్రాన్ని స్థాపించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. గతంలో బాటసారులు విశ్రాంతి తీసుకోవ డానికి, సొంత ఇల్లు లేని పేద కుటుంబాలు దహన కార్యక్రమాలు పూర్తయ్యేంతవరకు మృతదేహాన్ని సత్రంలో ఉంచు కునే విధంగా, దిన కార్యక్రమాలు చేసుకునేలాగా, పరిస్థితులను గమ నించి, అలాంటి వారికి సహా యంగా ఈ సత్రాన్ని అంకితం చేసిన మహనీ యుడని కొనియాడారు. అనంతరం ఉగ్గిరాల సీతారామయ్య మాట్లాడుతూ, బాపట్లతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసు కున్నారు. గరుడాచలం నాయుడు చేసిన దానం, సేవా తత్వం వృథా కాకుండా అందరం కలిసిక ట్టుగా కాపాడుకో వాల్సి న బాధ్యత ఉందని అన్నారు. ఇరువురు ప్రముఖులు తూర్పు సత్రం అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తులసి రామచంద్ర ప్రభు తెలిపారు. అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచి, మరింత మంది పేదలకు ఉపయోగపడేలా అభివృద్ధి చర్యలు చేప ట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తూర్పు సత్రం చైర్మన్ గుంటుపల్లి తులసి కుమారి, బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్ మాట్లాడుతూ, పేరం గరుడాచలం నాయుడు వంటి మహనీయుల ఆశ యాలను నిలబె ట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సత్రం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రముఖుల సందర్శనతో తూర్పు సత్రానికి కొత్త ఊపు వస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## 16వ బాలు చాత్రాలయం వార్షికోత్సవం

బాపట్ల, మేజర్‌న్యూస్: aim for seva (బాలుర చాత్రాలయం) 16వ వార్షికోత్సవం స్థానిక విజయ లక్ష్మీపురం హాస్టల్ నందు ఆదివారం జరిగింది ముఖ్య అతిథిగా శ్రీ శ్రీ శ్రీ స్థైర్యానంద సరస్వతి స్వామి వారు హాజరయ్యారు. సందర్భంగా వారు భక్తులను ఉద్దేశించి కొద్దిసేపు ముచ్చటించారు.అన్నం సతీష్ ప్రభాకర్, ఆత్మీయ అతిథిగా ముప్పల కామేశ్వరరావు , విశిష్ఠ అతిథిగా మన్నవ సిద్ధార్థ , పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ శెక్రటరీ మామిడి రాజశేఖర్ ఆధ్వర్యంలో మెంబర్స్ పరిస వెంకట్, పందిటి రవి, పువాడ యలమంద , హాస్టల్ ఖుతీసవఅ టి శ్రీనివాసరావు, బాబు నాగేంద్ర, మామిడి రమేష్, సుబ్రమణ్యం మొదలగు వారు పాల్గొన్నారు



## పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

దర్శి, మేజర్‌న్యూస్: ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగు తున్న నేపథ్యంలో దర్శి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఝాన్సీ జూనియర్ కాలేజ్, గీతాంజలి జూనియర్ కాలేజ్, లయోలా జూనియర్ కాలేజ్, తాళ్లూరులోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ సెంటర్ ని ఇతర ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఆదివారం దర్శి సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.రామారావు సందర్శించారు. పరీక్షల నిర్వహణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసు సిబ్బందికి పరీక్షా నిర్వహణ అధికారికి తెలిపారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ఆప్రాంతాలలో గుంపులుగా ఉండవద్దని సీఐ తెలిపారు. అంతేకాకుండా ఇప్పటికే పరీక్షకేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, నెట్ సెంటర్లను స్వచ్ఛందంగా మూసివేయాలని నోటీసులు ఇచ్చినట్లు సిఐ వై రామారావు చెప్పారు. పరీక్షాకేంద్రాల వద్ద కాపీలను ప్రోత్సహించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే అటువంటివారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని సీఐ వై.రామారావు హెచ్చరించారు.

## 'అనేక అడుగులు ఒక ప్రస్థానం' కవితా సంకలనం ఆవిష్కరణ



వేటపాలెం, మేజర్‌న్యూస్: "కవితకు ఏ వస్తువైనా అర్హమే. కుక్కపిల్ల, అగ్గిపుల్లను హీనంగా చూడకూడదని మహాకవి చెప్పిన దృష్టితోనే ఈ సంకలనం వెలువడింది" అని రాష్ట్ర ఉగాది పురస్కార గ్రహీత వడలి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని రోటరీ కమ్యూనిటీ హాల్లో ప్రోబస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.'అనేక అడుగులు ఒక ప్రస్థానం' సంకలన గ్రంథంలో 41 మంది కవులు తమ కవిత్వంతో సాహితీ ప్రియులను ఆకట్టుకు న్నారని తెలిపారు. సత్రం మల్లేశ్వరరావు రచించిన 'మా జన్మభూమి మహనీయుల పుణ్యభూమి' కవితలో సామాజిక సందేశం ప్రతిబింబించిందన్నారు. సజ్జ వెంకటేశ్వర్లు రచించిన 'నూరేళ్ల నా ప్రేయసి కోసం' కవిత సారస్వత నికేతన్ గ్రంథాలయ శతాబ్ది సంద ర్భాన్ని హృద్యంగా ఆవిష్కరించిందని కొనియా డారు.తాను రచించిన 'వాస్తవాల ముంగిట' కవితలో చీరాల ప్రాంత చేనేత వైభవాన్ని ప్రతిబింబించానన్నారు. లక్ష్మీ దుర్గ రచించిన 'చీరాలకు చిరునామా' కవితలో ప్రాంతీయ ప్రత్యేకతలను చక్కగా చిత్రించారని తెలిపారు. సభకు ప్రోబస్ క్లబ్ అధ్యక్షుడు వలేటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు సుబ్బరామయ్య, కోశాధికారి కొసనం నాగమాంబ, రోటరీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి సీతారాం, రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ అందే మురళి వరప్రసాద్, ముప్పల శివప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## లెనిన్ దూర దృష్టికి నిదర్శనం రెడ్ బుక్



మార్టూరు, మేజర్ న్యూస్: పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద విపరీత పోకడలు ప్రపంచ దేశాలకు నష్టదాయకమని 110 సంవత్సరాల క్రితమే కమ్యూనిస్టు యోధుడు వి ఐ లెనిన్ రచించిన రెడ్ బుక్ నేటి సమాజానికి దిక్సూచి వంటిదని సిఐటియు జిల్లా నాయకుడు మజుంధార్ అన్నారు. మార్టూరులో ఆదివారం నిర్వహించిన రెడ్ బుక్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాడు లెనిన్ ఊహించినట్లే నేడు ప్రపంచంలో బలమైన మూడు నాలుగు దేశాలు చిన్న, బలహీనమైన దేశాలపై దాడులు సాగించటం మనం చూస్తున్నామని ఆయన అన్నారు. చిన్న చిన్న దేశాలలోని ముడిచమురు మరియు ఖనిజ సంపద ల దోపిడీ లే లక్ష్యంగా అగ్ర రాజ్యాలు యుద్ధకాంక్షతో సామ్రాజ్యవా దాన్ని ప్రోత్సహిస్తున్నాయని ఆయన అన్నారు. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానంలో చివరి దశ అని పరిణామక్రమంలో తరువాత ఏర్పడేది కమ్యూనిస్టు సమాజమేనని లెనిన్ 100 సంవత్సరాల క్రితమే ఊహించగలిగారని నేడు అది వాస్తవ రూపం దాల్సబోతున్న విషయాన్ని మేధావులు గుర్తిస్తున్నారని మంజుందార్ అన్నారు. బత్తుల హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ళ రామ కోటేశ్వరరావు, బి సూరిబాబు, వై రాంబాబు, షేక్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

అద్దంకి, మేజర్‌న్యూస్: అద్దంకిలో నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలవుతున్న సందర్భంగా పట్టణంలో ని పరీక్షా కేంద్రాలను అద్దంకి సీఐ సుబ్బరాజు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అద్దంకి పట్టణంలో సోమవారం నుండి మూడు కళాశాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతా యన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశ్వ భారతి కళాశాల, శ్రీ చైతన్య కళాశాలలో ఉద యం 9 గంటల నుంచి మధ్యా హ్నం 12 గం టల వరకు పరీక్షలు ఉంటా యన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నుండి మార్చి 18వ తేదీ వరకు కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సెంటర్ సమీపంలో గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. పరీక్ష లు రాసే విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను సకాలంలో పరీక్షా కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.



## ఉపాధ్యాయ దంపతులకు ఘన సన్మానం

గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని డిఎంఆర్ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల నందు పనిచేయుచున్న డి.దేవ కరుణనిధి త్వరలో పదవీ విరమణ చేయబోతున్న సందర్భంగా కాంప్లెక్స్ చైర్మన్ సిద్దేశ్వర శర్మ అధ్యక్షతన కాంప్లెక్స్ తరుపున దేవకరుణనిధి, వారి భర్త నెమిలిగుండంకు ఘనంగా దుశ్శాలువ, పూలమాలతో సన్మానించడం జరిగినది. ఈ సమావేశంలో కాంప్లెక్స్ సెక్రెటరీ టి.కె.యస్ ప్రసాద్, రిసోర్స్ పర్సన్స్ సి.రామచంద్రారెడ్డి, సిహెచ్ ఆవులరాజు, కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగినది.



## ప్రమాణస్వీకారానికి భారీగా వెళ్లిన నాయకులు

చిన్నగంజాం, మేజర్‌న్యూస్: బాపట్లపార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు దేశంపార్టీ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ మహోత్సవంలో పాల్గొనడానికి చినగంజాంమండలం నుంచి తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలోతరలి వెళ్లారు.చిన్నగంజాంమండలం నుండి బాపట్లజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధానకార్యదర్శిగా నక్కల రాఘవ,బాపట్లపార్లమెంట్ అధికారప్రతినిధిగా సయ్యద్ అబ్దుల్ కలాంఆజాద్ ప్రమాణ స్వీకారం సంద ర్భంగా చిన్నగంజాం మండలం నుండి సుమారు135 కార్లతో భారీ ర్యాలీగా ఆదివారం బాపట్ల తరలివెళ్లారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లావాణి జ్యవి భాగం అధ్యక్షులు కొండ్రగుంట శ్రీహరి,చిన్నగంజాం తెలుగుదేశంపార్టీ అధ్య క్షుడు పొద వీరయ్య,కోకి భాస్కరరెడ్డి,నరహరి శ్రీనివాసరావు, జయ రావు, సందు శీను,రామసుబ్బారావు,జిలాని, యార్లగడ్డ నారాయణ పాల్గొన్నారు.



## చాందిని కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ఇంకొల్లు, మేజర్‌న్యూస్: ఇంకొల్లు కు చెందిన నిరుపేద ముస్లీ కుటుంబానికి చెందిన పఠాన్ జానీబాషా, చాందినిల పాప కు అనారోగ్యం అని తెలిసిన వెంటనే పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు స్పందించి రు. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సదరు మొత్తాన్ని ఇంకొల్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇంకొల్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు చేతుల మీదుగా బాధిత కుటుం బానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు మార్కెట్‌యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు, కొణికి సొసైటి అధ్యక్షులు కరి శ్రీనివాసరావు, బోడెంపూడి సుబ్బారావు, వడ్లమూడి సాంబయ్య, షేక్ రఫి, షేక్ మీరావలి, షేక్ మస్తాన్‌బాబా పాల్గొన్నారు.

## అల్లం గోపికి పలువురు అభినందన



బాపట్ల మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులుగా ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన అల్లం గోపికృష్ణను రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ మంద పాటి ఆంద్రేయ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జిట్టా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు మద్దాల ముసలయ్య తెలుగుదేశం పార్టీ నాయ కులు,అడ్వకేట్ భోగిరెడ్డి రమేష్ రెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ సం దర్భంగా జిట్టా మాట్లాడుతూ అల్లం గోపికృష్ణ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని చేపట్టిన పదవికి వన్నెతేవాలని ఆకాంక్షించారు

సూర్య
www.suryaa.com

PRAKASAM ప్రకాశం | MARKAPURAM మార్కాపురం | BAPATLA బాపట్ల



## పేద ప్రజల ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యత

### 58 మందికి రూ.67.21 లక్షల సీఎం రిలీఫ్ మంజూరు

### నగదు చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, మేజర్‌న్యూస్ : పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ అన్నారు. ఒంగోలు నియోజకవర్గ పరిధిలో 58 మందికి రూ 67 లక్షల 21 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు అయ్యింది. ఆదివారం ఒంగోలు టిడిపి కార్యాలయంలో లబ్ధిదారులకు నగదు చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల ఆరోగ్యానికి కొండంత అండ అన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, లబ్ధిదారులు, బంధువులు ఉన్నారు.

# భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ తల్లి

**పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలి**

**కూటమి ప్రభుత్వంలో దేవాలయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు**

**మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య**

**ఘనంగా పోలేరమ్మ తల్లి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం**

జరుగుమల్లి, మేజర్‌న్యూస్ : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ తల్లి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కామేపల్లిలో పోలేరమ్మ తల్లి దేవస్థానం నూతన కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ మాట్లాడుతూ భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ తల్లి, ఈ ఆలయానికి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద



ఎత్తున దర్శించుకునేందుకు వస్తుంటారు. నూతన ఆలయ కమిటీ దేవాలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలి. భక్తుల సౌకర్యం కోసం దేవాలయం బయట మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు, కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు చేపడతాం. కూటమి పాలనలో హిందూ



దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారు. వైసిపి హయాంలో దేవాలయాల ప్రతిష్టను మంట గలిపి హిందువుల మనోభావాలు దెబ్బతీశారు. కాసుల కక్కుర్తితో తిరుమల శ్రీవారి ప్రసాదంలో కృత్రిమ నెయ్యి వాడి మహాపచారం చేశారు. ప్రసాదంలో కల్తీ జరిగిందని ఓవైపు నాడు టిటిడి చైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నారు. కానీ జగన్ మాత్రం కల్తీ జరగలేదని బుకాయిస్తున్నారు. సిట్ నివేదికను సైతం వక్రీకరిస్తున్నారు. వైసిపి తీరును వెంకటేశ్వర స్వామి గమనిస్తున్నాడు, ఆయనే తగిన విధంగా వారిని శిక్షిస్తాడని మంత్రి స్వామి అన్నారు.





ఒంగోలు నగరంలోని ఇస్లాంపేట మసీద్ నందు రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం సాయంత్రం గంజి పంపిణీలో పాల్గొన్న శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్. అనంతరం ముస్లీం పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

# అట్టహాసంగా బాపట్ల పార్లమెంట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**మొదటి పేజీ తరువాయి** భావించే రోజుల్లో, తెలుగు వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నారని, వారి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ పార్టీ స్థాపించారని తెలిపారు. తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించారని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కృషి ఫలితంగా అధికారంలోకి వచ్చి ప్రజలకు సేవలందిస్తున్నామని చెప్పారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బాపట్ల ఎంపీతో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలుగా గెలిచామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ ఇంజిన్ సర్కారుతో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. జిల్లాలో జాతీయ రహదారుల కోసం ఆరు వేల కోట్ల రూపాయలు, రైల్వేల అభివృద్ధి కోసం ఎనిమిది వేల కోట్ల రూపాయలు నిధులతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ పదవులు వచ్చిన వారు బాధ్యతగా వ్యవహరించాలని, చంద్రబాబు నాయుడు ఆశయాలకు ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీకి అండ, దండ, కొండంత బలం పార్టీ కార్యకర్తలని చెప్పారు. రానున్న ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలలో కూటమి అభ్యర్థులను నాయకులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలన్నారు. గత ప్రభుత్వం పాలన వలన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అందువలన ప్రతిపక్ష హోదా కూడా లేకుండా 11 సీట్లతో





పరిమితం చేశారని ఆయన ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వాన్ని వైసిపి ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెట్టి విడగొట్టాలని ప్రయత్నాలు చేస్తుందని ఆయన ఆరోపించారు.

ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశంలో ఎక్కడ లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా అందించటం జరుగుతుందన్నారు. మంచం మీద ఉన్న వారికి కూడా రాజభోగం జరుగుతుందంటే అది ఒక కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యపడుతుందని చీరాల శాసనసభ్యులు కొండయ్య అన్నారు. శివశక్తి పథకం ద్వారా కొన్ని కోట్ల మంది బస్సులలో మహిళామణులు ప్రయాణిస్తున్నారన్నారు. ఒకపక్క సంక్షేమం మరో పక్క అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో నడవడానికి కూడా అనుకూలం లేని రహదారులను నేడు రహదారులతో మహర్దశ పట్టిందని తెలిపారు.

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల తెలుగుదేశం పార్టీ జిల్లా పార్టీ కార్యాలయం శంకుస్థాపన చేయటం మహోత్తరమైన రోజుగా పేర్కొన్నారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని పరిరక్షించడం కోసం ప్రపంచ వ్యాప్తంగా నందమూరి తారక రామారావు పరితపించారన్నారు. ఏ ఒక్క వ్యక్తి స్వలాభం కోసమో, అడ్డగోలుగా డబ్బులు సంపాదించి దాచుకోవటానికి, అధికారాన్ని అడ్డుపెట్టుకొని వేల కోట్లు సంపాదించడం కోసం పెట్టిన పార్టీ కాదన్నారు. కోటి మందిపైగా సభ్యత్వం ఉన్న ఒక ప్రాంతీయ పార్టీ ఒక తెలుగుదేశం పార్టీ అన్నారు. బడుగు బలహీన వర్గాల, దళితుల, రైతు కుటుంబాల నుండి, పేద కుటుంబాల నుంచి ఎంతోమంది లక్షల మంది నాయకులను అందించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నేడు పుట్టిన బిడ్డ భవిష్యత్తు 20 ఏళ్ల తర్వాత ఆ బిడ్డ భవిష్యత్తు కోసం ఏమి చేయాలని పరితపించే వ్యక్తి అన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ద్వారా ప్రజలకు ఏమేమి హామీలు ఇచ్చారో అవన్నీ అమలు చేస్తున్నారని, యువతరానికి నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ఆయన తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అనే సైకో ప్రజా జీవితానికి పనికిరాడు అని 11 సీట్లతో పరిమితం చేశారని ఆయన అన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా నేడు మరల రాజ్యాధికారం కోసం పరితపిస్తున్నాడని అన్నారు. గత ప్రభుత్వ ఐదు సంవత్సరాల పాలనా కాలం మరల రాకూడదని ఆయన కోరారు. కార్యక్రమంలో సంతనూతలపాడు శాసనసభ్యులు విజయ్‌కుమార్, మాజీ శాసనసభ్యులు చెంచు గరటయ్య, చీరాల గోవర్ధన్‌రెడ్డి, నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, ఉపాధ్యక్షులు అల్లం గోపి, సెక్రెటరీ నక్క రాఘవయ్య , వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





